క్లుప్తంగా

ప్రజావాణిలో 8 ఫిర్యాదులు



ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్‌, టౌన్‌ ప్లానింగ్‌, రెవెన్యూ, అర్బన్‌ బయోడైవర్సిటీ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణిలో ప్రజలు 8 ఫిర్యాదులు అందజేశారు. టౌన్‌ ప్లానింగ్‌ సెక్షన్‌కు 4, ఇంజినీరింగ్‌ 2, శానిటేషన్‌ 1, ఎలక్ట్రికల్‌కు 1 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. ప్రజావాణిలో ఏఎంసీలు శ్రవణ్‌ కుమార్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌, ఏసీపీ వెంకటరమణ, ఏసీపీ వెంకటరమణ, ప్రాజెక్టు ఆఫీసర్‌ మల్లీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీఎన్‌జీఓకాలనీలో కవులు, కళాకారులకు సత్కారం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని టీఎన్‌జీఓకాలనీలో తెలంగాణ ప్రభుత్వ మహిళా పెన్షనర్ల ఫోరమ్‌ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన కవులు, రచయితలను మంగళవారం సత్కరించనున్నట్లు నిర్వాహకులు ఉమాదేవి, ఎస్‌ఎంఎల్‌ నాగమాంబ, ధనలక్ష్మి వివరించారు. ఉదయం 11 గంటలకు కాలనీలో పెద్ద ఆలయం సమీపంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరామ్‌, రచయిత, కవులు, అందెశ్రీ, పాశం యాదగిరి, జయరాజ్‌, అశోక్‌తేజ, ఎక్కా యాదగిరి, విమల, వెన్నెల వంటి వారిని సత్కరించడం జరుగుతుందని వారు తెలిపారు.

బయోసైన్స్‌ టాలెంట్‌ టెస్ట్‌ జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

రాయదుర్గం: బయోసైన్స్‌ టాలెంట్‌ టెస్ట్‌లో రాయదుర్గం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 27న జరిగే జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించడం విశేషం. ఈ టెస్ట్‌లో మొదటి స్థానంలో తాజీన్‌, రెండవ స్థానంలో సదరక్‌ నిలిచారు. వీరిని సోమవారం జెడ్పీహెచ్‌ఎస్‌ ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే తాజ్‌బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

నకిలీ టీపొడర్‌ తయారీ కేంద్రంపై దాడి

చందానగర్‌: ప్రమాదకరమైన ఫుడ్‌ కలర్స్‌తో టీ పొడర్‌ తయారు చేస్తున్న కేంద్రంపై అధికారులు దాడి చేసిన ఘటన చందానగర్‌ సర్కిల్‌ పరిధిలో చోటు చేసుకుంది. చందానగర్‌లోని ఓ నివాసంలో గత కొన్ని రోజులుగా చంద్రశేఖర్‌ అనే వ్యక్తి నకిలీ టీ పొడర్‌ తయారు చేస్తున్నాడు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్‌, చందానగర్‌ సర్కిల్‌ ఫుడ్‌ సేఫ్టీ అధికారి హృదయ సోమవారం కేంద్రంపై దాడిచేశారు. నకిలీ టీ పొడర్‌ను నగరంలోని మోహిదీపట్నం, టోలీచౌకి, తెల్లాపూర్‌, పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, చందానగర్‌ ప్రాంతాల్లో పలు దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.130 కిలోల టీ పొడర్‌ సహా ఇతర ఫుడ్‌ కలర్స్‌ స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ బాలస్వామి, ఎస్సై సాయికిరణ్‌ పాల్గొన్నారు.

నృత్యం.. నయనానందకరం





మాదాపూర్‌: కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ చేనేత హస్తకళా మేళాలో భాగంగా సోమవారం కథక్‌, కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. డాక్టర్‌ సాయి జీవన శిష్యబృందం గణేశ్‌ వందన, సరస్వతీ వందన, అభినయ్‌గీత్‌, దుర్గస్తుతి, తరణ, తిల్లాన అంశాలను ప్రదర్శించారు. కళాకారులు వైష్ణవి, నెహ్వాల్‌, కిషన్‌, శ్వేతరావులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. త్రైలోక్య ఆర్ట్స్‌ అసోసియేషన్‌ గురువు ఇందిరా పరాశరం శిష్యబృందం వందనం, కొలువైతివా రంగసాయి, బృందావన, వేడెలారా, శ్రీమాత, శివాని, చార్వి, గీతికా, శ్రీయ, దర్శిని, కావ్య తనిష్కలు చక్కటి అభినయంతో సందర్శకులను అలరించారు.

సౌత్‌ జోన్‌ స్థాయి పోటీల్లో సత్తాచాటిన 'మనూ' విద్యార్థులు



మైమ్‌, ప్లే పోటీలలో సౌత్‌ జోన్‌ స్థాయిలో రాణించిన 'మనూ'విద్యార్థులు

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం విద్యార్థులు సౌత్‌ జోన్‌ స్థాయి వివిధ పోటీల్లో తమ సత్తా చాటారు. బెంగళూరులోని క్రైస్ట్‌ యూనివర్సిటీలో అసోసియేషన్‌ ఆఫ్‌ ఇండియన్‌ యూనివర్సిటీస్‌ (ఏఐయూ) నిర్వహించిన 38వ సౌత్‌, ఈస్ట్‌ జోన్‌ యూత్‌ ఫెస్టివల్‌లో గణనీయమైన ప్రదర్శన ఇచ్చారు. తెలంగాణ, కర్నాటక, ఛత్తీస్‌ఘఢ్‌ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ విశ్వ విద్యాలయాలతో పోటీ పడిన 'మనూ'విద్యార్థులు అసాధారణ ప్రతిభ, సృజనాత్మకతను చాటి మైమ్‌ పోటీలో రెండవ బహుమతి, ప్లే పోటీలో మూడవ బహుమతిని సాధించారు. నోయిడాలోని అమిటీ యూనివర్సిటీలో జరిగే ప్రతిష్టాత్మక జాతీయ యూత్‌ ఫెస్టివల్‌లో ఈ అద్భుతమైన విజయం 'మనూ'జట్టుకు చోటు సంపాదించింది. 'మనూ'వైస్‌చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌, అధ్యాపకులు మైమ్‌, ప్లే పోటీలలో రాణించిన వారిని అభినందించారు.

పేద విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేయాలి



స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

రాయదుర్గం: పేద విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేయాలని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. రాయదుర్గం, ఖాజాగూడలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థులకు సందయ్య మెమోరియల్‌ ట్రస్ట్‌, ఆర్‌కేవై ఫౌండేషన్‌ సంయుక్తాధ్వర్యంలో ఆల్‌ఇన్‌వన్‌ స్టడీ మెటీరియల్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి పదవ తరగతి అత్యంత కీలకమన్నారు. పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు కలిపి ఆల్‌ఇన్‌వన్‌గా, మోడల్‌ ప్రశ్న పత్రాలు సంబంధించిన బుక్‌లెట్‌ అందించడం అభినందనీయమన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్‌, గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి, రాయదుర్గం, ఖాజాగూడ హెచ్‌ఎంలు ఎస్‌కే తాజ్‌బాబు, రాజశేఖర్‌, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



ప్రజావాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు అధికారులు

రాయదుర్గం: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు పరిష్కరించాలని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సూచించారు. హఫీజ్‌పేట్‌లోని జలమండలి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు కాలనీవాసులు నుంచి వచ్చే వినతిపత్రాలలోని సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. తాగునీటి పైప్‌లైన్‌ నిర్మాణం, యూజీడీ పైప్‌లైన్‌ నిర్మాణ పనులకు ప్రతిపాదనలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలు కాలనీవాసులు అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకొచ్చారు. నీటి సరఫరా సమయం, ప్రెషర్‌ తగ్గుతోందని, సురక్షితమైన తాగునీటిని సరఫరాను చేసేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మంజులారెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్‌, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న సాయిబాబా, రామస్వామి యాదవ్‌

చందానగర్‌: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌, కొమిరిశెట్టి ఫౌండేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను సోమవారం నిర్వహించారు. కొండాపూర్‌లోని సీఆర్‌ ఫౌండేషన్‌లోని మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను కొమిరిశెట్టి ఫౌండేసన్‌ అధ్యక్షుడు కొమిరిశెట్టిసాయిబాబా, ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కన్వీనర్‌ రామస్వామి యాదవ్‌ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ప్రతియేటా సంక్రాంతి సందర్భంగా శేరిలింగంపల్లిలోని 35 కాలనీలలో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. న్యాయనిర్ణేతలుగా తాటిచర్ల వరలక్ష్మి, అనూష వ్యవహరించారు. 50 మంది మహిళల ముగ్గులను తిలకించి విజేతలను ప్రకటించగా వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌ ఫౌండేషన్‌ డైరెక్టర్‌ కల్పన, కోశాధికారి చెన్నకేశవరావు, అసోసియేషన్‌ సభ్యుడు శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం రంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా రమేష్‌



నియామక పత్రం అందుకుంటున్న సీమ రమేష్‌

మియాపూర్‌: ఉద్యమకారుల ఫోరం రంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా మియాపూర్‌కు చెందిన సీమల రమేష్‌ కురుమ నియామకమయ్యారు. ఓ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ చీమ శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రమేష్‌ను నియమిస్తూ గ్రేటర్‌ హైదరాబాద్‌ కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్‌ హైదరాబాద్‌ కన్వీనర్‌ దయానంద్‌, సెక్రటరీ నరసింహచారి, సికింద్రాబాద్‌ పార్లమెంట్‌ ఇన్‌చార్జి భూపాల్‌, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంబాబు, మీడియా అధికార ప్రతినిధి తాడూరి గగన్‌ కుమార్‌, టీయూఎఫ్‌ టీవీ ప్రతినిధి వెంగళ భాస్కర్‌ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపి వేస్తున్నట్లు కొండాపూర్‌ ఏఈ ఎస్‌.రంగారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రశాంత్‌నగర్‌, సఫారీనగర్‌, కొత్తగూడ విలేజ్‌, కొండాపూర్‌, 8వ బెటాలియన్‌, జూబ్లీగార్డెన్‌, భిక్షపతినగర్‌, గోల్డెన్‌ తులీప్‌, రాఘవేంద్ర కాలనీ ఏ,బీ,సీ బ్లాక్‌లు, రాజరాజేశ్వరీనగర్‌, సైబర్‌ వ్యాలీ, గోపాల్‌రెడ్డి నగర్‌, అపర్ణ, హఫీజ్‌పేట్‌, సాగృతి కాలనీ, శ్రీనివాస్‌ కాలనీ, ఆనంద్‌నగర్‌, మీనాక్షి అపార్ట్‌మెంట్స్‌, శిల్పాపార్క్‌, టీసీఎస్‌, ఇజ్జత్‌నగర్‌ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నమని పేర్కొన్నారు.

వైట్‌ఫీల్డ్‌ పరిధిలో..

మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు వైట్‌ఫీల్డ్‌ ఏఈ కిశోర్‌ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైట్‌ఫీల్డ్‌, శ్రీరాంనగర్‌ ఏ, బీ బ్లాక్‌లు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంజయ్య నగర్‌, సిద్దిఖీనగర్‌, రాజీవ్‌నగర్‌ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

రెడ్డి కాలనీ ఫీడర్‌ పరిధిలో..

మియాపూర్‌: రెడ్డి కాలనీ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ రవి చంద్రా ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రెడ్డి కాలనీ, బీకే ఎన్‌క్లేవ్‌, సాయినగర్‌, సాయిజ్యోతి నగర్‌ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. అదేవిధంగా మియాపూర్‌ ప్రగతి ఎన్‌క్లేవ్‌ ఫీడర్‌ పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా ఏఎస్‌ఆర్‌ స్టాట్యూ, డీకేఎన్‌క్లేవ్‌, ప్రశాంతినగర్‌, సాయినగర్‌, ఏవీఆర్‌ హోమ్స్‌, మహోదయ హోమ్స్‌, జేపీ నగర్‌ మెయిన్‌ రోడ్డులో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో..టమాట 20, పచ్చిమిర్చి 40, బెండ 50, కాకర 50, దొండ 60, దోస 40, ఆలు 40, చామ 60, కీర 40, బీర 70, వంకాయ 40, గోకర 60, బీన్స్‌ 60, బీట్‌రూట్‌ 60, క్యాప్సికమ్‌ 60, క్యాబేజీ 30, క్యారెట్‌ 60, చిక్కుడు 60, ఉల్లి 60(కేజీ), ములక్కాయలు (1) 30 , క్యాలీఫ్లవర్‌ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 400.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరం

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ బి.శరత్‌చంద్ర వెల్లడించారు. సోమవారం 4వ డివిజన్‌లోని హైదర్షాకోట్‌, 15వ డివిజన్‌లోని శాంతదినగర్‌ కాలనీ, 16వ డివిజన్‌లోని రఘురాంనగర్‌ కాలనీలలో సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. ప్రజల నుంచి పూర్తి వివరాలను నమోదు చేసుకొని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. వార్డు ఆఫీసర్‌ వెంకటప్ప, బిల్‌ కలెక్టర్‌ నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిపై యువతకు అవగాహన అవసరం



హిమాచల్‌ ప్రదేశ్‌ పర్యటను వెళ్లిన విద్యార్థుల బృందం

రాయదుర్గం: భారతీయ సంస్కృతి, చరిత్ర, విజయాలపై యువతకు అవగాహన అవసరమని మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్‌ చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ పీఏప్‌ రహమాన్‌ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల తెలంగాణ వ్యాప్తంగా 50 మంది విద్యార్థుల బృందం హిమాచల్‌ ప్రదేశ్‌లోని ఎన్‌ఐటీ హమీర్‌పూర్‌కు పరివర్తన యాత్రలో పాల్గొన్నారు. సోమవారం వారిని ఉద్దేశించి ఇన్‌చార్జి వైస్‌ చాన్స్‌లర్‌ మాట్లాడుతూ.. భారతదేశంలోని విభిన్న ప్రాంతాల మధ్య ఐక్యత, అవగాహనను పెంపొందించే లక్ష్యంతో ఏక్‌ భారత్‌ శ్రేష్ట భారత్‌ (ఈబీఎస్‌బీ) గొడుగు కింద ఫ్లాగ్‌షిప్‌ ఇనిషియేటివ్‌ యువసంఘం కార్యక్రమంలో భాగంగా నిర్వహించారని గుర్తు చేశారు. 'మనూ'మాస్‌ కమ్యూనికేషన్స్‌ డీన్‌, నోడల్‌ ఆఫీసర్‌ ప్రొఫెసర్‌ మహ్మద ఫరియాద్‌ మాట్లాడుతూ.. యువ సంఘం కేవలం సందర్శన పర్యటన మాత్రమే కాదని, ఇది స్వీయ ఆవిష్కరణ, క్రాస్‌ కల్చరల్‌ లెర్నింగ్‌ యొక్క రూపాంతర ప్రయాణమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత శాస్త్ర దినోత్సవం



మోడల్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రాయదుర్గం: జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని సోమవారం రాయదుర్గంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. జెడ్పీహెచ్‌ఎస్‌ ప్రాంగణంలో గణిత శాస్త్ర మోడల్స్‌ను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించారు. జెడ్పీహెచ్‌ఎస్‌ హెచ్‌ఎం ఎస్‌కేతాజ్‌బాబు మాట్లాడుతూ.. ప్రతియేటా గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఒక వైజ్ఞానిక ప్రదర్శన తరహాలో నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు పలు రకాల మోడల్స్‌ తయారు చేసి తమ సత్తాను చాటారన్నారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయులు శ్రీనివాస్‌, కృష్ణవేణి, లక్ష్మణ్‌, ప్రజ్ఞచైతన్య, శాంత, మమత, క్రాంతి, శ్రీలత, మహిపాల్‌ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం సాగింది.

త్వరలో డ్రైనేజీ పనులు చేపడతాం



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి

పటాన్‌చెరు టౌన్‌: డివిజన్‌ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయించడంతో పాటు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం డివిజన్‌ పరిధిలోని శాంతినగర్‌, శ్రీనగర్‌ కాలనీల్లో స్థానిక కార్పొరేటర్‌ మెట్టుకుమార్‌ యాదవ్‌, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ సురేష్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీలు నిర్మించి చాలా ఏళ్లు కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే .. త్వరలో ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు చేపడతామని తెలిపారు. అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విజయ్‌ కుమార్‌, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు

పటాన్‌చెరు: కార్పొరేట్‌ కు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మెలకువలు నేర్పుతున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. ఐసీడీఎస్‌, అజీజ్‌ ప్రేమ్‌ జీ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయుల కోసం పటాన్‌చెరులోని అంగన్‌వాడీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పూర్వ ప్రాథమిక విద్య తరంగిణి టీచర్స్‌ మేళాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్వ శిశు విద్యార్థులకు ప్రాథమిక విద్య, గర్భిణులకు పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ప్రతీ సంవత్సరం తరంగిణి పేరుతో ప్రేమ్‌ జీ ఫౌండేషన్‌ అందిస్తున్న సేవలన కొనియాడారు. ముందుగా వివిధ అంశాలపై ఏర్పాటు చేసిన నృత్య రూపకాలు, కథలు చెప్పడం, అక్షరాస్యత కృత్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌ యాదవ్‌, ఐసీడీఎస్‌ జిల్లా అధికారి లలిత కుమారి, సీడీపీఓలు జైరామ్‌ నాయక్‌, చంద్రకళ, సూపర్‌వేజర్లు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ భూమిని కాపాడాలని ధర్నా



తహసీల్దార్‌ ఆఫీస్‌ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

జిన్నారం (పటాన్‌చెరు): ఆలయ భూములను కాపాడాలంటూ సోమవారం జిన్నారం తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట గ్రామస్తులు ధర్నా చేశారు. మండల కేంద్రంలోని తాబేలు గుట్టపై నూతనంగా నిర్మిస్తున్న జీవన జ్యోతిర్లింగ భూమిని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఆందోళనకు దిగారు. ఈ విషయంపై గతంలోనూ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన అధికారులు స్పందించలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆలయ భూమిని కాపాడాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌ యాదవ్‌, రాజిరెడ్డి, రాజేందర్‌రెడ్డి, నరసింహులు, రంగారెడ్డి, మహేందర్‌గౌడ్‌, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కట్టుకో.. దండుకో!

అమీన్‌పూర్‌ మున్సిపాలిటీ త్వరలో గ్రేటర్‌లో విలీనం కాబోతుంది. అయితే ఈ సంధికాలంలో అధికారులు రెచ్చిపోతున్నారు. బిల్డర్లను భయభ్రాంతులకు గురి చేసి అందినకాడికి దండుకుంటున్నారు. సీఎం పేషీ స్థాయిలో తనకు అండ ఉందంటూ ఓ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారికి నోటీసులు ఇస్తున్నామంటూ హల్‌చల్‌ సృష్టిస్తున్నారు.

- అమీన్‌పూర్‌లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- అధికారులే అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు
- ఫిర్యాదు చేస్తే నోటీసులతో హల్‌చల్‌



చక్రపురి కాలనీలో పార్కు స్థలంలో నిర్మాణాలను పాక్షికంగా కూల్చివేసిన దృశ్యం (ఫైల్‌)

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌ మున్సిపాలిటీలో అక్రమ కట్టడాలకు అధికారులు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెరువులు, కాలువలు కబ్జాకు గురవుతున్నాయి. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. పార్కు స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోవడం లేదు. సెట్‌బ్యాక్‌ లేకపోయినా నిర్మాణాలకు అడ్డుచెప్పడం లేదు. హెచ్‌ఎండీఏ మాస్టర్‌ ప్లాన్‌లో ఉన్న రోడ్లను సైతం ఆక్రమిస్తున్నారు. కరెన్సీ కట్టలతో ప్రసన్నం చేసుకునే బిల్డర్లకు కొమ్ముకాస్తున్నారు. పట్టణంలోని సింఫనీ కాలనీకి వెళ్లే దారిలో ఓ కౌన్సిలర్‌ భర్త ఎలాంటి అనుమతి లేకుండా స్విమ్మింగ్‌ పూల్‌ నిర్మాణం చేపడుతున్నారు. ఆ నిర్మాణానికి నోటీసులు జారీ చేశారు, కానీ నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అమీన్‌పూర్‌ పట్టణంలో బంధం కొమ్ము చెరువు పరిధిలో బఫర్‌ జోన్‌లో హెచ్‌ఎండీఏ అనుమతులతో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. రెండు చెరువుల మధ్య సర్వే నంబర్‌ 410, 387లో చెరువుల అనుసంధాన కాలువను ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సర్వే నంబర్‌ 993లో ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపడుతున్నట్లు గుర్తించి వారికి తహసీల్దార్‌ నోటీసులు జారీ చేశారు. కానీ మున్సిపల్‌ అధికారులు మాత్రం ఆ భవన నిర్మాణానికి అడ్డు చెప్పలేదు. చక్రపురి కాలనీలో ఓ పార్కు స్థలం కబ్జాకు గురైంది. అక్కడ నిర్మాణాలను పాక్షికంగా కూల్చివేశారు. కానీ నేటికీ ఆ పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకోలేదు. కోర్టు పరిధిలో ఉన్న చక్రపురి కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతి జారీ చేసే అవకాశం లేదు. అయినా నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారు. పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ మున్సిపల్‌ అధికారులు పట్టించుకోవడం లేదు. విలీన గ్రామాల్లో అక్రమ నిర్మాణాలకు అధికారులు నోటీసులు ఇచ్చి బిల్డర్లను భయభ్రాంతులకు గురి చేసి వారి నుంచి అందిన కాడికి దండుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. బొల్లారం వెళ్లే దారిలో పీఎస్‌ఆర్‌ కాలనీలో మాస్టర్‌ ప్లాన్‌ రోడ్డుపై ఏమాత్రం సెట్‌ బ్యాక్‌ లేకుండా జరుగుతున్న నిర్మాణాలను అధికారులు అడ్డుకోవడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు.

మూడు పట్టణాలకు ఒక్కరే..

అమీన్‌పూర్‌, బొల్లారంతో పాటు తాండూర్‌ పట్టణానికి ఒకే టౌన్‌ ప్లానింగ్‌ అధికారి ఉండడంతో సమస్యలు వస్తున్నాయి. అనుమతుల జారీ ప్రక్రియలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆయన ఏ మున్సిపాలిటీకి అందుబాటులో ఉండటం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

చర్యలు తీసుకుంటున్నాం



అక్రమ నిర్మాణాలను ఎప్పటికప్పుడు అడ్డుకుంటున్నాం. కొత్తగా విలీనమైన గ్రామాల్లో సైతం చర్యలు తీసుకుంటున్నాం. అవినీతికి తావు లేకుండా నిబంధనల ప్రకారం వ్యవహరిస్తున్నాం.

– జ్యోతిరెడ్డి, కమిషనర్‌, అమీన్‌పూర్‌